
## క్లిష్ట పరిస్థితుల్లో వెన్నుపోటు పొడుస్తారా!

### కాంగ్రెస్‌లో పోచారం చేరికపై వేముల

వేల్పూర్, జూన్ 21 : పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో అధినేత కేసీఆర్‌కు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వెన్నుపోటు పొడవడం అత్యంతబాధాకరమని మాజీ మంత్రి, వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారం, పదవులు లేకుంటే బతకలేమా, ఈ వయస్సులో పార్టీ మారడం ఆయనకు భావ్యమా అని ప్రశ్నించారు. పోచారానికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని, ఆయనను ఎప్పుడూ లక్ష్మీ పుత్రుడని సంభోధిస్తూ అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ..పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరిక నేపథ్యంలో స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పోచారం శ్రీనివాసరెడ్డిని ఎప్పుడూ పెద్దలు అంటూ ముందు వరుసలోనే ఆయన పక్కనే కూర్చుండబెట్టుకునే వారని గుర్తు చేశారు. తాను హౌసింగ్ మినిస్టర్‌గా ఉన్నా, తన కన్నా ఎక్కువగా బాన్సువాడకు అడిగినన్నీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చారని తెలిపారు. పోచారం అత్యంత ఇష్టదైవంగా భావించే తెలంగాణ తిరుమల గుడికి కూడా అడిగినన్ని నిధులు ఇచ్చారని, ప్రాణం పోయే వరకు కేసీఆర్ వెంటే ఉంటానని అన్నారని గుర్తుచేశారు.



- కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్
- దూరమైన చిరు వ్యాపారుల కరెంట్ కష్టాలు

## 24 గంటలూ వెలుగులే

**కేసీఆర్ హయాంలో** ఎలాంటి కరెంట్ కష్టాలు లేకుండే.. 24 గంటలూ మెరుగైన విద్యుత్ అందించారు. దీంతో అన్ని రకాల చిరువ్యాపారులూ తమ వ్యాపారాలను ధీమాగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరంగా కరెంట్ ఇవ్వడంతో తాము ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేసుకున్నామంటూ నాటి కేసీఆర్ పాలనను పలువురు చిరువ్యాపారులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రభుత్వం మారడంతో మళ్లీ కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయని ఆందోళన చెందుతున్నారు.

### మళ్లీ కరెంట్ కష్టాలు వచ్చినయ్..

కేసీఆర్ హయాంలో 24గంటల కరెంటుతో ఇబ్బంది లేకుండా పనులు తొందరగా పూర్తి చేసుకునేది. రైతులకు గాని ఇతరత్రా పనులు ఆలస్యం కాకుండా పూర్తి చేసి ఇచ్చేవాడిని. పొద్దున 8గంటలకు పనులు ప్రారంభిస్తే రాత్రి 11వరకు పనులు చేస్తూనే ఉండేవాళ్లం. కేసీఆర్ హయాంలో ఒక్క నిమిషం కూడా కరెంటు పోలేదు. ఇప్పుడు మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయి.

**-పవన్‌చారి, లైట్‌మిషన్ ఆపరేటర్, వెల్డర్, నవీపేట**





### గతంలో ఒక్క నిమిషం పోయేదికాదు

నవీపేట,జూన్ 21: కేసీఆర్ పాలనలో కరెంట్ కోతలు అసలే లేకుండే. 24 గంటల పాటు కరెంట్ ఇవ్వడంతో వ్యాపారులెవరూ ఇబ్బందులు పడలే. నేను ప్రతిరోజు కరెంట్ తోనే పిండి గిర్ని నడిపించుకుంటున్న. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి కరెంట్ కొనుగోలు చేసి ఇచ్చిండ్రు. కానీ ఇప్పుడు మళ్లీ కరెంట్ కష్టాలు మొదలైనయి. ఎప్పుడు పోతుందో..ఎప్పుడు వస్తుందో తెలియడంలేదు. మళ్లీ పాతరోజులు వచ్చాయేమోనని అనిపిస్తున్నది.

**-సయ్యద్ జిలానీ, పిండిగిర్ని యజమాని, నవీపేట**

### కేసీఆర్ సార్‌కు మొక్కాలే

పదేండ్ల కేసీఆర్ పాలన భేష్ అని చెప్పాలే. 24 గంటల పాటు త్రీఫేస్ ఉచిత కరెంట్ ఇచ్చిన కేసీఆర్ సార్‌కు రెండు చేతులు ఎత్తి మొక్కాలే. దేశంలోనే తెలంగాణలో 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చింది ఒక కేసీఆరే. ఆయన దిగిపోయిన తర్వాత కరెంట్ బాధలు మొదలయ్యాయి. రోజుకు పదిసార్లు కరెంట్ ట్రిప్పు కావడంతో మేము ఇస్త్రీ బట్టలు చేయలేక పోతున్నాం. పదేండ్లపాటు నిరంతరం కరెంట్ ఇచ్చిన కేసీఆరే గుర్తుకు వస్తున్నాడు.

**-ఎస్. జీవన్, లాండ్రీ షాపు యజమాని, నవీపేట**



## కష్టాల 'సాగు'

- ముఖం చాటేసిన వరుణుడు
- ఇప్పటి వరకు నమోదుకాని సాధారణ వర్షపాతం
- గతేడాదితో పోలిస్తే -22.2శాతంలోటు నమోదు
- ఎండిపోయే స్థితిలో నారుమడులు
- నిజాంసాగర్ ప్రాజెక్టు పైనే ఆశలు

ఆందోళనలో అన్నదాత

*వానకాలం సాగుపై అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. సీజన్ ప్రారంభమై తొలకరి పలుకరించినా..ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. జిల్లాలో ఇంకా సాధారణ వర్షపాతం కూడా నమోదుకాకపోవడం, వరప్రదాయినిగా పేరొందిన నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో రైతన్నకు సాగు కష్టాలు తప్పడం లేదు. నీరులేక రైతులు నారుమడులను సంరక్షించుకునే పరిస్థితి లేకుండా పోయింది.*

*-బాన్సువాడ, జూన్ 21*





**వానకాలం** ప్రారంభమై సుమారు 20 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదుకాలేదు. నిత్యం ఉరుములు, మెరుపులు, గాలిదుమారం రేగడంతో వర్షం కురుస్తుందేమోనని రైతులు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. సాగునీటి సౌలభ్యం ఉన్న బోరుబావుల వద్ద కొందరు రైతులు ముందస్తుగానే నారుమడులు వేసుకున్నారు. వ్యవసాయశాఖ సూచనల మేరకు మిర్గంవరకు నారుమడులు వేసి, వర్షాలు కురిస్తే నాట్లు వేయడానికి రైతులు దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్నారు. కానీ వరుణుడు ముఖం చాటేయడంతో వాగులు, వంకల్లో నీరులేక నారుమడులు ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వానకాలం పంటలసాగుపై వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేసి, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచింది.కానీ సాగునీటి వసతులు లేకపోవడంతో రైతులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది.


గతేడాది ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్నా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నీటిని విడుదల చేసింది. ఈ సంవత్సరం ప్రాజెక్టులో సాగు కోసం నీళ్లు ఉన్నా విడుదల చేయడంలో ప్రస్తుతం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటివిడుదలపైనే గంపెడాశలు పెట్టుకున్నారు.

### జిల్లాలో సాగు ప్రణాళిక..

కామారెడ్డి జిల్లాలో వ్యవసాయ శాఖ వానకాలంలో రైతుల సాగు, అంచనా ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో వానకాలంలో 3,13, 965 ఎకరాల్లో వరిసాగు అంచనా వేసింది. కానీ బాన్సువాడ, కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఇప్పటి వరకు సుమారు 85 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు నారుమడులు వేసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 3200 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు రైతులు సుమారు 20 వేల ఎకరాల్లో పచ్చరొట్ట విత్తనాలు వేసుకున్నట్లు సమాచారం. జిల్లాలో సుమారు లక్షా 80 వేల ఎకరాల్లో ఆరు తడి పంటల (మక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి, పెసర, మినుము, తొగరు, చెరుకు, వేరుశనగ తదితర)సాగుకు అధికారులు అంచనాలు రూపొందించారు. కానీ వర్షాలు కురవకపోవడం, నిజాంసాగర్ నీటి విడుదల చేయకపోవడంతో మక్కజొన్న 3500, సోయాబీన్1300, చెరుకు 30, తొగర్లు 200 ఎకరాల్లో సాగుచేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తితే వేసిన పంటలు మొలకెత్తకపోవచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### నిజాంసాగర్‌పై గంపెడాశలు

గత వానాకాలంతో పోల్చి చూస్తే జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా నమోదైంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో సాగు కష్టాలు దూరమయ్యాయి. ఈ ఏడాది జూన్ మాసంలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడం గమనార్హం.ఒకవైపు జిల్లాలో వర్షాలులేక, మరోవైపు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేపట్టకపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. వర్షాలు కురిసే వరకు నిజాంసాగర్ నుంచి నీటిని అందిస్తే వరినాట్లు, నారుమడులు వేసుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు. కామారెడ్డి జిల్లా లో జూన్ 1 నుంచి 20 వరకు 91.9 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం71.4 మి.మీ శాతం మాత్రమే నమోదైనట్లు అధికారులు తెలిపారు.-.22.2 లోటు వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

## గోదావరికి జలకళ

- నదిలోకి ప్రవేశించిన కొత్త నీరు..
- ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**మండలంలోని** *కందకుర్తి గ్రామసమీపంలో గోదావరి, హరిద్రా, మంజీరా నదులు కలిసే త్రివేణి సంగమ క్షేత్రం జలకళను సంతరించుకుంది. ప్రతి ఏడాది ఏరువాక పౌర్ణమి రోజున నదిలోకి కొత్త నీరు వచ్చి చేరడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, పుణ్య స్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజలతో నదీ పరీవాహక ప్రాంతం శివనామ స్మరణతో మార్మోగింది. నదిలోని పురాతన శివాలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.*

*-రెంజల్, జూన్ 21*



### స్కానింగ్ సెంటర్ ఘటనపై
## జడ్పీలో రచ్చరచ్చ

- అధికారులపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు
- చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీత
- డీఎంహెచ్‌వో సమాధానంపై మహిళా సభ్యుల ధ్వజం
- సిగ్గుచేటన్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌ను నిలదీస్తున్న జడ్పీటీసీ



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ విఠల్‌రావు

కంఠేశ్వర్,జూన్ 21: నిజామాబాద్ జిల్లా పరిషత్ పాలకవర్గం చివరి సమావేశం శుక్రవారం వాడీవేడిగా సాగింది. స్కానింగ్ సెంటర్ల వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజాప్రతినిధులు నిప్పులు చెరిగారు. అక్రమ ఇసుక రవాణా, ఉచిత బస్సు ప్రయాణం తదితర అంశాలపై ప్రశ్నించారు. జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన శుక్రవారం చివరి పాలకవర్గ సమావేశం నిర్వహించా రు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో పాటు కొందరు ఎమ్మెల్యేలు ఈ భేటీకి రాకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు సమావేశం జరుగుతున్న సమయంలో కరెంట్ పోవడంతో జనరేటర్‌తో మీటింగ్‌ను కొసాగించారు. జిల్లా కేంద్రంలో కొద్దిరోజుల నుంచి దుమారంలేపుతున్న అయ్యప్ప స్కానింగ్ సెంటర్ వ్యవహారంపై చర్చ రచ్చకు దారి తీసింది. అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో జరిగిన దారుణంపై ప్రధానంగా సాగిన చర్చలో మహిళా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కానింగ్ సెంటర్లపై పత్రికల్లో వచ్చిన వరుస కథనాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని మహిళా సభ్యులు డీఎంహెచ్‌వోను నిలదీశారు. అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో ఎటువంటి ఆధారాలూ దొరకలేదని, సంబంధిత ఫైల్ కలెక్టర్ వద్ద ఉందని డీఎంహెచ్‌వో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవస్థను చక్కదిద్దాల్సిన అధికారులు అక్రమార్కుల వంతపాడటం ఎంతవరకు సబబని వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్ ప్రశ్నించారు. అదనపు కలెక్టర్ అంకిత్ కలుగజేసుకుని స్కానింగ్ సెంటర్ వ్యవహారంపై కమిటీ వేశామని, దాని ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### సిగ్గుతో తలదించుకుటున్నా..

స్కానింగ్ సెంటర్ వ్యవహారంపై మహిళా సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోవడం సిగ్గుచేటని, సిగ్గుతో తల దించుకుంటున్నానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఉద్యోగులు ప్రొటోకాల్ పాటించాలని, ఆర్మూర్ అభివృద్ధికి ఎన్ని నిధులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అర్మూర్ సొమ్ము కొడంగల్‌కు, నిజామాబాద్ సొమ్ము ఖమ్మంకు మళ్లిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కులమతాలు,పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

### ఇసుక అక్రమ రవాణా పట్టదా?

ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణమేమో కానీ ప్రయాణికుల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని కమ్మర్‌పల్లి ఎంపీపీ గౌతమి అన్నారు. బస్సుల్లో మహిళలకు రక్షణ లేదని, గతంలో సమయానుసారం అందుబాటులో ఉన్న బస్సులు ఇప్పుడు ఎటు పోయాయని ప్రశ్నించారు. ఇసుక అక్రమ రవాణా గురించి మోర్తాడ్ జడ్పీటీసీ రవి అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే రీచ్‌లను వదిలేసి, దొంగతనంగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదన్నారు. సమావేశం ముగింపు సమయంలో జడ్పీ చైర్మన్ విఠల్‌రావు జడ్పీటీసీలు, ఎంపీపీలను సత్కరించారు. జడ్పీ సీఈవో ఉషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 'యోగా' నందం

*ఉమ్మడి జిల్లాలో* *శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు పాల్గొని యోగాసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యతను పలువురు యోగా గురువులు వివరించారు. పలుచోట్ల యోగా ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టగా.. విద్యార్థులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.*



జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాలులో ప్రాణాయామం చేస్తున్న న్యాయవాదులు